# రైలు ప్రయాణంలో తారసపడ్డ రాజనీతిజ్ఞులు

**– లీనా శర్మ**

1990 సంవత్సరం వేసవి కాలంలో నాతోపాటు ట్రెయినింగులో వున్న సహోద్యోగినితో కలిసి పని మీద లక్నో నుంచి ఢిల్లీకి రాత్రి బండిలో బయలుదేరాను. ఇద్దరు పార్లమెంటు మెంబర్లు కూడా అదే ఫస్ట్ క్లాస్ బోగీలో వున్నట్టు త్వరలోనే తెలిసింది. అంతవరకు ఫరవాలేదు కానీ రిజర్వేషన్ లేకుండా డజనుకి పైబడి వున్న యితర ప్రయాణీకుల విషయం మమ్మల్ని భయపరిచింది. వున్న మా యిద్దరు యువతుల్ని మా రిజర్వుడ్ బెర్తుల్నించి బలవంతంగా ఖాళీ చేయించి లగేజి మీద కూచునేట్టు చేశారు. మా గురించి వాళ్ళు అసభ్యంగా నీచమైన వ్యాఖ్యలు చేస్తూ వుంటే భయంతో కుంగిపోయినా, కోపంతో గింజుకున్నా ఏమీ చెయ్యలేకపోయాం. విషమ రాత్రి. పైగా ట్రావెలింగ్ టికెట్ ఇన్‌స్పెక్టరు (టి.టి.ఇ.) ఎక్కడా కనుచూపు మేరలో లేడు.

పాతికేళ్ళ వయసులో వున్న నేను, నా సహోద్యోగిని భౌతికంగా ఎలాంటి హాని జరక్కపోయినా, మానసికంగా కుంగిపోయి మర్నాడు పొద్దున ఢిల్లీకి చేరుకున్నాం. ముందు రాత్రి అనుభవానికి మానసికంగా దెబ్బతిన్న నా సహోద్యోగిని అహ్మదాబాద్‌లో రెండవ దశ ట్రెయినింగుకి రాకుండా ఢిల్లీలోనే వుండిపోయింది. ఉత్పల్‌పర్ణ అనే మరో సహోద్యోగిని నాతో వస్తున్నందుకు నేను ప్రయాణం కొనసాగించాగాను.

ఈసారి రిజర్వేషన్ లేకుండా కేవలం వెయిట్ లిస్టులో వున్న టికెట్లతో అహ్మదాబాద్ వెళ్ళే మరో రాత్రి బండి ఎక్కి ఫస్ట్ క్లాస్ కోచి టి.టి.ఇ.కి తెలియబరిచాం. ''బండి ఫుల్లుగా వుంది,'' అన్నాడతను. అయినా మర్యాదగా మమ్మల్ని రెండే బెర్తులుండే కూపే తలుపు తెరిచి కాసేపు అక్కడ కూచోండన్నాడు. లోపల కూచున్న ఖాదీ బట్టల వ్యక్తులిద్దరి వంక ఒక్క చూపు చూసి *మరో యిద్దరు రాజకీయ నాయకులు – మళ్ళీనా!* అనుకున్నా. నా ముఖ వైఖరి కనిపెట్టి టి.టి.ఇ. చాలా అనునయంగా, ''వాళ్ళిద్దరు చాలా మర్యాదస్తులు, ఈ రూట్‌లో తరచుగా ప్రయాణిస్తుంటారు, మీకేం ఫరవాలేదు,'' అంటూ అభయమిచ్చాడు. అందులో నడి యాభైల్లో వున్న ఒకాయన నవ్వు ముఖంతో ఆత్మీయంగా వున్నట్టు గమనించాను. బహుశ నలభై ఏళ్ళు దాటినట్టు కనిపిస్తున్న రెండవ వ్యక్తి వుత్సాహంగా వున్నా పెద్దగా పట్టించుకునే వాడిలా అనిపించలేదు. వెంటనే మా సామాన్లకూ, మాకూ చోటు కల్పిస్తూ మూలకి జరిగి వొదిగి కూచున్నాడాయన.

రైలు బయల్దేరిన తరవాత వాళ్ళిద్దరు గుజరాత్‌కు చెందిన బి.జె.పి. సభ్యులు అని పరిచయం చేసుకున్నారు. నేనప్పుడు వాళ్ళ పేర్లని పట్టించుకోలేదు. అస్సాం రాష్ట్రానికి చెందిన మేమిద్దరం ఇండియన్ రైల్వే సర్వీసులో ప్రొబేషనర్లుగా మా పరిచయం తెలుపుకున్నాం. సూర్యుడు పడమటి దిశలో కిందికి దిగుతూ రైలు జోరుగా పోతుంటే అందరం కబుర్లు వేసుకున్నాం. మంచి విషయ పరిజ్ఞానమున్న ఆ యిద్దరితో ఎం.ఏ. హిస్టరీ చేసిన ఉత్పల్‌పర్ణ చాలా విషయాలు మాట్లాడింది. మధ్యలో అప్పుడప్పుడు నేను కూడా కలుపుతూ వచ్చా. చివరకి మా సంభాషణ దేశ స్వాతంత్ర్యానికి ముందు రోజుల్లో హిందు మహాసభ, ముస్లిం లీగ్‌ల ఆవిర్భావానికి దారి తీసింది.

ఆ ఇద్దర్లోకి వయసెక్కువున్న వ్యక్తి సంభాషణలో చురుగ్గా పాలుపంచుకున్నాడు. చిన్నవాడు చాలావరకు మౌనంగా కూచున్నా జరిగే సంభాషణలో తానూ భాగస్తుడిలా అనిపించాడు. ఒక సందర్భంలో 1953లో జరిగిన

శ్యామప్రసాద్ ముఖర్జీ ఆకస్మిక మరణం, దాని వెనక వున్న మిస్టరీ గురించి ప్రస్తావించాను. ముఖర్జీ పేరొందిన విద్యా వేత్త, రాజకీయ నాయకుడు, కాంగ్రెస్‌ని వదిలి భారతీయ జన సంఘ్ పార్టీ స్థాపించేంత వరకు నెహ్రూగారి కేబినెట్‌లో మంత్రి.

అది వినగానే ఆ చిన్నాయన  వున్నట్టుండి జోక్యం చేసుకుంటూ, ''శ్యామప్రసాద్ ముఖర్జీ గురించి మీకెలా తెలుసు?'' అని అడిగాడు.

''మా నాన్నగారు పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్‌గా కలకత్తా యూనివర్సిటీలో వున్నప్పుడు శ్యామప్రసాద్ ముఖర్జీ దానికి వైస్ ఛాన్సలరు, ఆయన తనకి స్కాలర్‌షిప్ యిప్పించినందుకు మా నాన్నగారు ఎప్పుడూ తలుచుకుంటూ వుండే వారు,'' అంటూ వివరించాను.

''గుడ్. వీళ్ళకి ఎన్నో విషయాలు తెలుసు ... '' స్వగతంగా అనుకుంటూ చిన్నగా నిట్టూర్చాడాయన. అది విని ఆయన స్నేహితుడు సంతోషించినట్టు కనిపించి, ''అవునూ, గుజరాత్ వచ్చారు కదా, మీరెందుకు మా పార్టీలో చేర కూడదు?'' అని అడిగాడు. దానికి నేనూ, ఉత్పల్‌పర్ణ నవ్వేస్తూ మేము గుజరాతీయులం కాదుగా అన్నాం.

''అయితే ఏమిటి?'' అన్నాడు యిద్దర్లోకి చిన్నవాడైన వ్యక్తి జోక్యం చేసుకుంటూ. శాంతంగా వున్న మనిషిలో వున్నట్టుండి తేజస్సు రగిలింది.''మాకైతే ఎలాంటి సమస్య లేదు. మా రాష్ట్రం ప్రతిభని స్వాగతిస్తుంది.''

కాసేపటికి డిన్నర్ వచ్చింది – నాలుగు వెజిటేరియన్ *థాలీలు*. తరవాత ప్యాంట్రీ కార్ మనిషి బిల్లు పట్టుకు రాగానే నలుగురి బిల్లూ యిద్దర్లో చిన్నవాడైన వ్యక్తి  చెల్లించాడు. ''థాంక్యూ,'' అని నేనంటే ఆయన పట్టించుకో లేదసలు. ఇంతసేపూ ఆయన మాట్లాడింది తక్కువ, విన్నదే ఎక్కువ అని అప్పుడు గుర్తించాను.

పడుకునే టైముకి టి.టి.ఇ. వచ్చి, ''మీ యిద్దరికి బెర్తులు ఖాళీ లేవు, అయాం సారీ,'' అని చెప్పాడు. దానర్థం మేమిద్దరం దిగి సెకెండ్ క్లాస్ అన్-రిజర్వ్‌డ్ బోగీలోకి వెళ్ళి కూచోవాలి. వెంటనే ఆ యిద్దరూ లేచి నుంచున్నారు.

''ఫరవాలేదు,'' అన్నాడొకాయన.

''మేము సర్దుకుంటాం,'' అని తోడు పలికాడు రెండో ఆయన.

తరవాత వాళ్ళిద్దరూ చేసిన పని బెడ్ షీట్లు కింద పరిచి విశ్రాంతి తీసుకోవడం.

''బెర్తుల మీద మీరు పడుకోండి,'' అని చెప్పి వెంటనే యిద్దరూ నిద్రలోకి జారుకున్నారు.

ముందురోజుకి, ఈరోజుకి ఎంత తేడా! నిన్నటి రాత్రి రాజకీయ నాయకుల్తో కలిసి చేసిన ప్రయాణం ఎంత అభద్రతకి, భయానికి దారి తీసింది. ఈరోజు వయసులో వున్న మరో యువతితో యిద్దరు రాజకీయ నాయకుల్తో కూపేలో నిర్భయంగా చేస్తున్న ప్రయాణం – స్వంత యింట్లో వుండే భద్రతకి సమానం అనిపించింది.

మర్నాడు పొద్దున రైలు అహ్మదాబాదుకి చేరువ అవుతుండగా అక్కడ మా వసతి సౌకర్యం గురించి వాళ్ళిద్దరూ వాకబు చేశారు. ఇబ్బందేమన్నా వుంటే తన యింటికి స్వాగతం అన్నాడు పెద్దాయన.

నిగూఢంగా వుండే చిన్నాయన, ''నేను దేశదిమ్మరి లాంటివాడిని. నాదంటూ సరైన యిల్లు లేదు, అందుకని మిమ్మల్ని పిలవలేను, మీకీ వూరు కొత్త కనక మీరు నా మిత్రుడి యింట్లో నిర్భయంగా వుండవచ్చు,'' అన్నాడు.

మా వైపు నుంచి థాంక్స్యూలు చెబుతూ అహ్మదాబాద్‌లో మాకు వసతి సౌకర్యం గురించి ఎలాంటి సమస్య లేదు అన్నాం. ప్రయాణం కాసేపట్లో ముగుస్తుందనగా అంతటి సహృదయం చూపించిన వ్యక్తుల్ని మర్చిపోకుండా నా డైరీ బయటికి తీసి వాళ్ళిద్దరి పేర్లు మరోసారి అడిగి తెలుసుకున్నాను. రాజకీయ నాయకుల గురించి నాకున్న అభిప్రాయాన్ని ఒక్క రోజులో మార్చుకునేటంత ప్రభావం నా మీద చూపారు వాళ్ళిద్దరూ. రైలు ఆగబోతుండగా గభాల్న వాళ్ళిద్దరి పేర్లు నా డైరీలో బరికాను. పెద్దాయన పేరు శంకర్‌సింహ్ వాఘేలా; చిన్నవాడు: నరేంద్ర మోడీ.

* * *

*సివిల్ సర్వెంటే కాక రచయిత్రి కూడా అయిన లీనా శర్మ అస్సామీలో ఎనిమిది నవలు రాశారు. ప్రస్తుతం ఆమె న్యూ ఢిల్లీలో ఇండియన్ రైల్వేస్‌కి చెందిన సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌కి జనరల్ మేనేజరు. ఈ ప్రయాణం గురించి మొదట 1995లో అస్సామీ వార్తా పత్రిక దైనిక్ అసోం లో వ్రాశారు. ఈ కాపీరైట్ వ్యాసం ది హిందూలో కూడా వచ్చింది.*

*కాపీరైట్ అయినా మరింతమంది చదవాలన్న సంకల్పంతో అనుమతి తీసుకోకుండా జులై 2014* రీడర్స్ డైజెస్ట్ *సంచిక నుంచి సేకరించి అనువదించింది – గబ్బిట కృష్ణమోహన్, హైదరాబాద్*